

సాక్షి పల్నాడు

మంగళవారం ౹ 29 ౹ అక్టోబర్ ౹ 2024



వెల్లటూరులో పారాయణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కొలువైన కట్లమ్మ తల్లి దేవస్థానంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం పారాయణ కార్యక్రమం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6908 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1748 క్యూసెక్కులు వదిలారు.

విఘ్నేశ్వరునికి వెండి కిరీటం



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో విఘ్నేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన పరిమి రామనరసింహం రూ.1.20 లక్షల విలువైన వెండికిరీటాన్ని సోమవారం సమర్పించారు. అనంతరం విఘ్నేశ్వరునికి కిరీటాన్ని అలంకరించారు.

న్యూస్‌రీల్

డీఈఓ చంద్రకళ బాధ్యతల స్వీకారం



నరసరావుపేటఈస్ట్: పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిగా ఎల్.చంద్రకళ సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. విద్యాశాఖ సాధారణ బదిలీలలో భాగంగా విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న చంద్రకళను బోయపాలెం డైట్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా బదిలీ చేయటంతోపాటు పల్నాడుజిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఈఓ కార్యాలయానికి వచ్చిన చంద్రకళ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

బోరులో బ్యాక్టీరియా

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో ప్రజలకు తాగునీరు అందించే బోరులో బ్యాక్టీరియా చేరినట్లు నివేదికలు వచ్చాయి. అంజనాపురం కాలనీలో మూడు చోట్ల నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం విజయవాడలోని ల్యాబ్‌కి పంపించారు. వీటిల్లో రెండింటిలో నీరు సాధారణంగా ఉండగా కాలనీవాసులకు తాగునీరు అందించే బోరులో క్లైబ్‌సిల్లా అనే బ్యాక్టీరియా చేరినట్లు ల్యాబ్ నివేదికలో వచ్చింది. ఈ బ్యాక్టీరియా తాగునీటిలో ఉండటం వలన ఆ నీరు తాగిన వ్యక్తులు వాంతులు, విరేచనాల బారిన పడతారని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఈ బోరుని అధికారులు సీజ్ చేసి క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందిస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్తెనపల్లి పట్టణంలోని టాక్సీస్టాండ్‌లో జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గార్లపాటి సునీల్‌బాబు ఉత్సాహంగా పాల్గొన్నారు. సునీల్‌బాబు ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా సత్తెనపల్లి మండలం భృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పట్టణంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల్గొని, రాజకీయనాయకులతో వేదికను పంచుకోవటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మొసలి సంచారం



మాచవరం: మండలంలోని వేమవరం గ్రామ సమీపంలోని చెక్‌డ్యాం వద్ద రహదారిపై మొసలి సంచరించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం రాత్రి సమయంలో గ్రామస్తులు వాహనాలపై ప్రయాణిస్తుండగా మొసలి రహదారిపైకి వచ్చి చెట్ల పొదల్లోకి వెళుతుండగా, ప్రయాణికులు సెల్ ఫోన్లో వీడియో తీసి అధికారులకు సమాచారం అందించారు. ఇటీవల మండలంలోని గంగిరెడ్డిపాలెం రామన్నకుంటలో మొసలి సంచరిస్తుందని, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగుల్లోకి వరదనీరు అధికంగా రావడంతో మొసళ్లు వస్తున్నాయని, అటవీశాఖ అధికారులు స్పందించి, ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డీఎస్‌డీఓగా నరసింహారెడ్డి



నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా పి.నరసింహారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఎస్‌డీఓగా విధులు నిర్వర్తిస్తున్న జి.సురేష్ రాజీనామా చేయటంతో నరసింహారెడ్డిని డీఎస్‌డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డి సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసారు.

టీడీపీలో విగ్రహం చిచ్చు

- అనుమతులు లేకుండా ఆస్పత్రిలో కోడెల విగ్రహం ఏర్పాటు
- విగ్రహం తొలగించిన అధికారులు
- సూపరింటెండెంట్‌పై కోడెల వర్గీయుల దౌర్జన్యం
- డాక్టర్ మంత్రునాయక్ కార్యాలయంలో నిర్బంధం
- ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఆదేశాల మేరకే విగ్రహం తొలగించామన్న అధికారులు
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన కోడెల వర్గీయులు

స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం తొలగింపు టీడీపీలో చిచ్చు రేపింది. కోడెల విగ్రహాన్ని సోమవారం అధికారులు తొలగించారు. దీనిపై ఆగ్రహించిన కోడెల వర్గీయులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. సూపరింటెండెంట్‌ను నిర్బంధించారు. స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్‌తో వాగ్వివాదానికి దిగుతున్న కోడెల అనుచరులు

నరసరావుపేటటౌన్: ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్‌ను కోడెల అనుచరులు నిర్బంధించారు. అనుమతులు లేకుండా వైద్యశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని అధికారులు తొలగించారు. దీనిపై ఆగ్రహించిన కోడెల వర్గం సోమవారం వైద్యశాల్లో నానా రగడ సృష్టించింది. ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేసి తొలగించిన స్థానంలోనే మళ్లీ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వివరాలలోకి వెళితే... లింగంగుంట్లలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో రెండు నెలల కిందట మాజీ స్పీకర్ దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. కోడెల వర్ధంతి నాడు దాన్ని ప్రారంభించాలని పూనుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావటంతో స్పందించిన ఉన్నతాధికారులు ముందస్తు అనుమతులు లేకుండా పెట్టిన విగ్రహాన్ని స్వచ్ఛందంగా తొలగించాలని ఏర్పాటు చేసిన వారికి నోటీసులు జారీ చేశారు. అయితే అనుమతులు వచ్చిన తర్వాతే విగ్రహం ప్రారంభిస్తామని కోడెల వర్గీయులు వైద్యశాల అధికారులకు తెలిపారు. అనుమతులు లేని విగ్రహం ప్రారంభించకుండా పోలీసు సిబ్బంది రెండు నెలలు కాపలా కాశారు. ఈ క్రమంలో సోమవారం వైద్యశాల ప్రాంగణంలో కోడెల విగ్రహం కనిపించలేదని గుర్తించిన కోడెల శివరామ్ అనుచరులు పెద్ద సంఖ్యలో సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విగ్రహం తొలగించటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ నాయకుడి విగ్రహాన్ని మురుగు కాల్వలో పడవేసినట్లు సమాచారం తమ వద్ద ఉందని వాగ్వివాదానికి దిగారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు చరణ్, హైమారావులు సిబ్బందితో వైద్యశాలకు చేరుకున్నారు. అప్పటికే సూపరింటెండెంట్ కార్యాలయంలో క్రింద బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్‌ను బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినలేదు.

ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ నినాదాలు..

కోడెల విగ్రహం తొలగింపు వెనుక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హస్తం ఉందని అక్కడకు వచ్చిన కోడెల వర్గీయులు ఆరోపించారు. తొలగించిన స్థానంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయటంతోపాటు కోడెల కుటుంబానికి క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కుట్రలో భాగం ఉన్న ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినదించారు.

ఎమ్మెల్యే సూచనలతో తొలగింపు

వైద్యశాలలో నూతనంగా ఎంసీహెచ్ బ్లాక్ మంజూరైంది. దాని ప్రారంభానికి ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆరోగ్య శాఖ మంత్రి త్వరలో రానున్నారు. ఈ క్రమంలో ఏర్పాట్ల పరిశీలనకు శనివారం వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభం చేయలేదు కాబట్టి కోడెల విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించి కార్యాలయంలో భద్రపరచాలని చెప్పిన ఆదేశాల మేరకు విగ్రహాన్ని తొలగించాం. వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కోడెల విగ్రహానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. అనుమతులు తీసుకోవాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. అయినా అనుమతులు తీసుకోలేదు.

–డాక్టర్ మంత్రునాయక్, సూపరింటెండెంట్, నరసరావుపేట ఏరియావైద్యశాల



సూపరింటెండెంట్‌ను చుట్టుముట్టిన కోడెల వర్గీయులు



గది ముందు బైటాయించిన కార్యకర్తలు

నెమలిపురిలో పోలీసు తనిఖీలు

- గ్రామస్తులకు కౌన్సెలింగ్
- 20 ద్విచక్ర వాహనాలు సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

రాజుపాలెం: గ్రామంలో గొడవలు, అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జీవించాలని అప్పుడే మీకు, మీ కుటుంబాలకు సమాజంలో మంచి గౌరవం ఉంటుందని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. మండలంలోని నెమలిపురి గ్రామంలో పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు ఉదయం 5 గంటలకు ప్రారంభించారు. గృహాలలో మారణాయుధాలు దొరుతాయని తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వాటిని రాజుపాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో గతంలో హత్య జరిగిందని, ఇలాంటివి పునరావృతం కాకూడదనే తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవ్వరూ గొడవలజోలికి వెళ్లవద్దని, అది మంచి పద్దతి కాదని, దీని వలన ఆస్తి నష్టపోవడమే గాక పిల్లల భవిషత్ దెబ్బతింటుందని తెలిపారు. గ్రామంలో చిన్నపాటి గొడవలు జరిగినా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని, రౌడీషీటర్లకు అనేక ఇబ్బందులు ఉంటాయని హెచ్చరించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, పేకాట ఆడిన, మద్యం సేవించి గొడవలు చేసిన సహించేది లేదని హెచ్చరించారు. సత్తెనపల్లి రూరల్, టౌన్ సీఐలు సుబ్బారావు, బ్రహ్మయ్య, రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్, పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి సీఐలు సురేష్, వెంకటప్రసాద్, శ్రీనివాసరావు, సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రతి అర్జీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించండి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు
- 105 అర్జీలు అందజేత



వినతులు స్వీకరించి బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 105 అర్జీలు అందజేశారు. అధికారులు ప్రత్యేక దృష్టితో ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిక్షిప్తం చేయాలన్నారు. తాను పొలం వెళ్లేందుకు మూడు చక్రాల సైకిల్ కావాలని సత్తెనపల్లికి చెందిన బీరం లక్ష్మీనారాయణ వినతిపత్రం సమర్పించగానే అప్పటికప్పుడు కలెక్టర్ అతడికి మూడు చక్రాల సైకిల్ తెప్పించి అందజేశారు. దీనికి సంతోషం వ్యక్తంచేసిన ఆ దివ్యాంగుడు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియచేశాడు. జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఇళ్లకు నోటీసులు ఇవ్వండి

అనేక సమస్యలతో సతమతమౌతున్న ఎస్ఆర్‌కేటీ కాలనీపై రెవెన్యూ, మండల, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. అసాంఘిక కార్యకలాపాలైన అల్లర్లు, దొంగతనాలు, గంజాయి, గుట్కా, మట్కా, మద్యం వ్యాపారానికి అడ్డాగా మారింది. నంబరు ప్లేట్లు లేని వాహనాలు ఎన్నో ఉన్నాయి. పోలీసులకు అన్నీ తెలిసినా ఏ చర్యలు తీసుకోవట్లేదు. దీంతో కాలనీ వాసులు మనోవేదన చెందుతున్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లకు నోటీసులు ఇవ్వండి. మౌలిక సదుపాయాలు కల్పించండి. రాష్ట్రానికే మోడల్ కాలనీగా తీర్చిదిద్దండి.

–షేక్ నాగూర్, ఎస్ఆర్‌కేటీ కాలనీ, నరసరావుపేట

నష్టపరిహారంలో సగం అందజేయండి



మా సోదరుడు బొంతా శివన్నారాయణ జూలై ఏడున ఎన్టీఆర్ జిల్లాలోని అల్ట్రా టెక్ సిమెంట్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారం ప్రకటించి చెక్కు అందజేసింది. మృతుడికి, భార్యకు మధ్య సంబంధాలు లేవు. ప్రమాదం జరిగి చికిత్స పొందుతున్న సమయంలో ఆయన బాగోగులు చూస్తే ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారంలో సగం మాకిచ్చేందుకు అంగీకరించి మేము, సోదరుడి భార్య అంగీకార పత్రం రాసుకున్నాం. ఒప్పందం ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన రూ.50 లక్షలలో సగం ఇచ్చేందుకు అంగీకరించట్లేదు. దయచేసి చేసుకున్న అంగీకారం మేరకు మాకు కూడా సగం నష్టపరిహారం అందజేయండి.

–జంగా ఆదిలక్ష్మి, తెల్లగొర్ల సిద్దేశ్వరి, మృతుని సోదరీమణులు

అగ్రహారం భూములపై సర్వే పూర్తిచేయండి



లింగంగుంట్ల పుష్పగిరి పీఠం భూముల పరిష్కారానికి చేపట్టిన సర్వే పూర్తిచేయాలంటూ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశాం. డిసెంబరు నాటికి సర్వే పూర్తిచేసి రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇస్తామని జేసీ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం జారీచేసిన జీవో 149 ప్రకారం గత అక్టోబరులో సర్వే ప్రారంభించారు. మఠంతో మేము కుదుర్చుకున్న ఎంవోయూ ప్రకారం రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇప్పించాలని కోరాం. దీనికి గాను సర్వే పూర్తిచేస్తామని చెప్పారు.

–ఏరువ బాలమోహనరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, పి.వీరారెడ్డి, నరసారెడ్డి, శ్రీ త్రికోటేశ్వర రైతు సంఘ ప్రతినిధులు

రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల

ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకురావాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. శిబిరంలో సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావుతోపాటు 51మంది అధికారులు, పోలీసులు రక్తదానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేకమంది పోలీసులు ప్రాణ త్యాగం చేసి అమరులయ్యారని అన్నారు. అటువంటి వారి త్యాగ ఫలితమే ఇప్పుడు మన మందరం సంతోషంగా ఉన్నామ ని చెప్పారు. రక్తదాన శిబిరం నిర్వహించటమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. రెడ్‌క్రాస్ సహకారం మరువలేనిది అన్నారు. రక్తదానం చేసిన పోలీసులు, యువతకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మూడేళ్ల నుంచి రక్తదానం శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తదానం చేసిన పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. వైస్ చైర్మన్ పీవీఎం శరత్‌బాబు, కోశాధికారి గంధ్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి, డాక్టర్ రహమతుల్లా, గెల్లి వీరారెడ్డి, జీవీఎస్ రాము, పుట్టి సాంబశివరావు, రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ వైద్యాధికారి మురళీధర్, అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ, వెల్ఫేర్ ఆర్ఐ సి.గోపీనాథ్, ఆర్ఐ అడ్మిన్ రాజా, ఎంటీ ఆర్ఐ కృష్ణ, ఆర్ఐ డీఎస్‌డబ్ల్యు యువరాజు, వైద్య విధాన పరిషత్ బ్లడ్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ దయానిధి పాల్గొన్నారు.

ఆస్తి విషయమై అన్నదమ్ముల ఘర్షణ

- ఒకరి మృతి
- నలుగురికి గాయాలు
- మండలంలోని హసనాబాద్ గ్రామంలో ఘటన



మృతుడు మహబూబ్ బాషా(ఫైల్)

క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామంలో ఆదివారం రాత్రి ఆస్తి విషయమై అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయాలపాలయ్యారు. ఎస్ఐ నాగేంద్రరావు తెలిపిన వివరాలు ఇలా... గ్రామంలో షేక్ మున్నీబీకి రెండు వివాహాలు జరిగాయి. మొదటి భర్త రెడ్డిగూడెం హుస్సేన్‌సాకు ఒక కుమారుడు షేక్ మహబూబ్ బాషా, రెండో భర్త కరిముల్లాకు ఒక కుమారుడు అబ్దుల్ బాసిద్, ఒక కుమార్తె ఫాతిమా ఉన్నారు. మొదటి భర్త హుస్సేన్‌సా కుమారుడు మహబూబ్ బాషాకు తన తండ్రికి చెందిన రెండు ఎకరాల పొలం, ఐదు సెంట్ల స్థలం ఉంది. వాటిని కరీముల్లా కుమారుడు బాసిద్ తనకు పంచాలని ప్రతి రోజూ గొడవ పడుతున్నాడు. ఆదివారం రాత్రి కొందరు ద్విచక్రవాహనాలపై వచ్చి బాషా ఇంటిలోకి చొరబడి కళ్లలో కారం చల్లి, కర్రలతో తీవ్రంగా కొట్టారు. ఇంట్లో ఉంటున్న తల్లి మున్నీబీ, మేనమామ చిన్న బాజీ, బాషా, బాషా భార్య గౌసియా, చిన్నబాజి కుమారుడు బురాన్‌లకు తీవ్రగాయాలు కాగా సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో బాషాను గుంటూరు తరలించారు. అక్కడ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐ సురేష్ త్వరలో నిందితుల్ని అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో వ్యక్తిపై దాడి



హత్యకు గురైన సైదులు

దుర్గి: డబ్బులు బాకీ విషయమై ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అడిగొప్పలలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. షేక్ సైదులు (25) స్థానికంగా ముఠా పనిచేసుకొని జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మరో వ్యక్తి మధ్య ఘర్షణకు పాల్పడటంతో స్వల్ప వివాదం జరిగింది. దాడికి పాల్పడిన వ్యక్తి సమాచారం తెలియలేదు. ఈ ఘటనలో సైదులు తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలో పడిపోయాడు. మృతుడి బంధువులు దుర్గి ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలు విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్‌బాబు తెలిపారు.

గ్రూప్-సి జట్టు ఘన విజయం

ఏడు వికెట్ల తేడాతో గ్రూప్-ఏ జట్టుపై గెలుపు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కె ఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌లో గ్రూప్-సి జట్టు ఏడు వికెట్లు తేడాతో గ్రూప్-ఏ జట్టుపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గ్రూప్-ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 216 పరుగులు చేయగా గ్రూప్-సీ జట్టు 361 పరుగులు చేసి 145 పరుగుల ఆధిక్యత సాధించింది. కాగా, రెండో ఇన్నింగ్స్‌కు దిగిన గ్రూప్-ఏ నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ ఒక వికెట్ నష్టానికి 115 పరుగులతో సోమవారం బ్యాటింగ్ ప్రారంభించి మరో 152 పరుగులు జోడించి 267 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మీ నారాయణ 65, జి.ఈశ్వర్ రుత్విక్ 56 పరుగులు సాధించారు. గ్రూప్-సి బౌలర్ జి.ఆకాష్ 12 ఓవర్ల వేసి 41 పరుగులు ఇచ్చి 4వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన గ్రూప్-సి జట్టు విజయానికి అవసరమైన 123 పరుగులను 27 ఓవర్లలో సాధించి 6 పాయింట్లను తన ఖాతాలో వేసుకుంది. జట్టులోని బి.మధుసూదన్ 68 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మిని స్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 77 ఫిర్యాదులు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు చేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే కుటుంబ, ఆర్థిక, ఆస్తి, మోసాలు, తగాదాలు మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 77 ఫిర్యాదులు స్వీకరించారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు బెదిరిస్తున్నారు

పూర్వీకుల నుంచి మాకు ఇల్లు వచ్చింది. దీని పక్కనే ఉన్న స్థలాన్ని కొందరు వ్యక్తులు కొనుగోలు చేశారు. మా ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు గొడవలు పెట్టుకొని నా భార్య, కుమారుడిని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోండి.

-కె.చంద్రశేఖర్, క్రోసూరు

రుణం చెల్లించినా ఇబ్బంది పెడుతున్నారు

పట్టణంలోని ఫైవ్ స్టార్ ఫైనాన్స్‌లో హౌసింగ్ లోన్ రూ.3.50 లక్షలు తీసుకున్నా. ఫైనాన్స్ వారు రూ.40వేలు తగ్గించి ఇవ్వగా లోన్ మొత్తం రూ.3.50లక్షలు చెల్లించాను. ఫైనాన్స్ వారు ఇంకా డబ్బులు కట్టాలని ఒత్తిడి చేస్తూ ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇవ్వకుండా బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోండి .

-సీహెచ్.బాజమ్మ, ములకలూరు, నరసరావుపేట మండలం

నా కుమారుడిని స్నేహితులు కిడ్నాప్ చేశారు

నా కుమారుడు తన ఫ్రెండ్స్ వద్ద డబ్బులు తీసుకున్నాడు. ఆ డబ్బుల విషయమై నాలుగు రోజుల నుంచి కనబడకుండా పోయాడు. తన కుమారుడిని స్నేహితులే కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానంగా ఉంది. కుమారుడిని కనుగొని న్యాయం చేయండి.

-కె.జ్యోతి, గురజాల

తెలంగాణ మాఫియా..ఆంధ్రాలో బెదిరింపులు

సత్తెనపల్లి వాసికి రౌడీషీటర్ పేరుతో బెదిరింపులు

నన్ను మోసం చేసి తీసుకున్న డబ్బులు అడిగినందుకు హైదరాబాదు శివారులో బిల్డర్ మధును చంపినట్లుగా చంపుతామని అదే ప్రాంతానికి చెందిన కత్తి వీరన్నగౌడ్, సాయి బెదిరించారని సత్తెనపల్లి మండలం వడ్డవల్లికి చెందిన యెల్లినీడి శ్రీనివాస్ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వ్యాపారం చేసుకొనే నేను, ఆర్గనైజర్‌గా ముదినేడి సుబ్బయ్య, షేక్ మహమద్ సలాం, మరో 70 మంది అంతా కలసి ఈనెల 14వ తేదీ నుంచి 17 వరకు గోవా ఈవెంట్‌కు వెళ్లాం. 15న ఆరోగ్యం బాగాలేక నేను గదిలోనే ఉండగా, నాతో పాటు వచ్చిన సుబ్బయ్య, సలాం, ఈ 70 మంది బాగోగులు చూడమని హైదరాబాదుకు చెందిన కత్తి వీరన్నగౌడ్, సాయికి అప్పచెప్పాను. వారు మోసం చేసి ఏటీఎం కార్డులు స్వైప్ చేసి రూ.4 కోట్లు తీసుకున్నారు. ఈనెల 18న ఇంటికి రాగా, 20న కత్తి వీరన్నగౌడ్, సాయి నాకు ఫోన్‌చేసి రూ.15 లక్షలు డబ్బులను కైసర్‌భాయి అనే అతనికి మామూళ్ల కింద ఇవ్వాలి, వారి మనుషులు నీ ఇంటికి వస్తారు, ఇచ్చేసెయ్, నీ డబ్బులు నీకు వస్తాయని బెదిరించారు. కైసర్‌భాయ్ మనుషులు రాగా రూ.9.90 లక్షలు ఇచ్చి పంపాను. నాకు డబ్బులు అవసరమై వీరన్నగౌడ్, సలాంలను అడగ్గా వారు నన్ను ఇష్టవచ్చినట్లుగా తిట్టి చంపుతామని బెదిరించారు. హైదరాబాదు శివారులో బిల్డర్ మధును చంపినట్లుగా చంపుతామని బెదిరించారు. నన్ను బెదిరించి మోసం చేసి తీసుకున్న డబ్బును మాకు ఇప్పించి రక్షణ కల్పించాల్సిందిగా కోరుతున్నాను.

వీవోఏలను విధుల్లోకి తీసుకోండి

- రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను గౌరవించండి
- జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన వీవోఏలు
- కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు, ఆర్పీలు, సీఐటీయు నాయకులు

నరసరావుపేట: అన్యాయంగా తొలగించిన వీవోఏ(విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు)లను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుచేసి, వారికి చెల్లించాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పెదకూరపాడు, రాజుపాలెం, అచ్చంపేట, క్రోసూరు, దాచేపల్లి తదితర మండలాల్లో గత 15ఏళ్ల నుంచి వివిధ గ్రామసంఘాల్లో పనిచేస్తున్న వారిని నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు రాజకీయ కారణాలతో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే రెండు నెలల క్రితం అన్యాయంగా తొలగించారన్నారు. నూతన వ్యక్తులను పెట్టుకొని పాతవారికి పనిచెప్పకుండా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై వీవోఏలు అనేకమార్లు కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకపోవటంతో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించటం జరిగిందన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఆ ఉత్తర్వులను తీసుకొని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌కు ఇద్దామని వెళితే తీసుకొని అమలుచేయకుండా నిరాకరిస్తున్నారన్నారు. కొత్తగా వచ్చిన వారిచేత పాత తేదీలతో నూతన తీర్మానాలను ఏపీఎం, సీసీలు తయారుచేస్తున్నారన్నారు. పొదుపు సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించి హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. కొంతమంది వీవోఏలు మాట్లాడుతూ బాబు వస్తే జాబు వస్తుందని అనుకుంటే ఉన్న జాబులు పోతాయని అనుకోలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన వీవోఏలు పాల్గొన్నారు.

రెండురోజుల్లో క్లీనింగ్, క్లోరినేషన్ పూర్తిచేయండి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: రానున్న రెండు రోజులలో జిల్లాలోని అన్ని ట్యాంకుల్లో క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మండల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్లు, మండల అధికారులు, ఈవోపీఆర్డీలు సంబంధిత అధికారులతో పారిశుద్ధ్యం (శానిటేషన్)పై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గత కొన్ని రోజులుగా అక్కడక్కడా డయేరియా కేసులు నమోదయ్యాయని, దానికి కారణం శానిటేషన్ లోపమని అన్నారు. మండల అధికారులు, మునిసిపల్ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి డ్రెయిన్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త దిబ్బలను తొలగించాలన్నారు. మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం వీడి పారిశుద్ధ్యంపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో బదిలీ అయిన పంచాయతి సెక్రటరీలు ఆయా బదిలీ స్థానాలలో విధులలో చేరాలని, ఇంకా చేరని వారు తక్షణమే విధులలో చేరేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధులలో నిర్లక్ష్యం వహించే మండల అధికారులు, ఈవోపీఆర్డీలపై శాఖాపరమైన చర్యలతోపాటు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. క్లాప్ మిత్రాలకు జాప్యం లేకుండా జీతాలు సకాలంలో చెల్లించాలన్నారు. అనంతరం పీఎం విశ్వకర్మ పథకంపై సమీక్షించారు. పథకం లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. జేజే యం కనెక్షన్ల ప్రక్రియ వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఈవోపీఆర్డీలు సస్పెన్షన్

అచ్చంపేట, బొల్లాపల్లి ఈవోపీఆర్డీలు వీర్రాజు, జానీబాషాలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో అలసత్వం వహించిన శావల్యాపురం, దుర్గి, రాజుపాలెం, పిడుగురాళ్లకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొనారు.

ఉద్యాన సహాయకులను ఆ శాఖలో విలీనం చేయాలి

నరసరావుపేట రూరల్: గ్రామ ఉద్యాన సహాయకులను మాతృశాఖ ఉద్యాన శాఖలో విలీనం చేయాలని గ్రామ ఉద్యాన సహాయకుల అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డిని కలిసిన అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉద్యానరంగంలో మన రాష్ట్రం దేశంలోనే ప్రగతిపథంలో నడుస్తుందని తెలిపారు. రోజురోజుకు ఉద్యానరంగం పంటల విస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో అరకొర నిధులతో, సిబ్బంది లేమితో ఉద్యాన శాఖ సతమతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ఉద్యాన సహాయకులను సచివాలయ వ్యవస్థతో సంబంధం లేకుండా ఉద్యాన శాఖకు కేటాయించాలని కోరారు. గతంలో పనిచేసే ఎంపీఈవోల మాదిరిగానే ఉద్యాన పంట విస్తీర్ణాన్ని బట్టి నలుగురు క్లస్టర్ బేసిస్‌లో పనిచేసే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల రమేష్, ఉపాధ్యక్షుడు షేక్ దస్తగిరి, సభ్యులు జీ.ఆంజనేయులు, వినుకొండ కిషోర్‌లు పాల్గొన్నారు.



ఉద్యాన అధికారి రమణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యాన సహాయకుల అసోసియేషన్ ప్రతినిధులు

నేడు జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విద్యాశాఖ సారధ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో బాల బాలికలకు జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం జరుగుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ అండర్-14,17 బాల బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. రెండు క్రీడా మైదానాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారందరికి అల్పాహారం, భోజన వసతి కూడా ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం రాష్ట్ర స్థాయిలో ఎంపికైనా జట్టు వివరాలు తెలుపుతామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు ప్రత్యేకంగా షీల్డ్ అందజేస్తారన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు కేబీఆర్ కళాశాల విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.వి.నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీలలో అచ్చంపేట గురుకుల విద్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. తమ విద్యార్థులు ఎం.దయాకర్ (65 కేజీలు, ఫ్రీ స్టైల్), ఎం.ధర్మానాయక్ (70కేజీలు, ఫ్రీ స్టైల్), ఎం.మహేష్ (70కేజీలు, గ్రీకో-రోమన్), కె.ప్రభాకర్ (96 కేజీలు, ఫ్రీ స్టైల్) ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 9, 10 తేదీలలో అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వి నీల్, అధ్యాపకులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ నాగిరెడ్డి

స్టేట్ మీట్‌కు ఎంపికైన ప్రశాంత్‌రాజ్

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ప్రశాంత్‌రాజ్ స్టేట్ మీట్‌కు ఎంపికైనట్లు పీడీ అరుణశ్రీ సోమవారం తెలిపారు. తాడికొండ మండలం రావెల హైస్కూల్లో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్-17 యోగ పోటీల్లో ప్రశాంత్‌రాజ్ ప్రతిభ కనబరిచారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ పున్నారావు, గ్రామ పెద్దలు యోగాలో ప్రతిభ కనపరిచిన ప్రశాంత్‌రాజ్‌ని, అతనికి శిక్షణ ఇచ్చిన యోగ ట్రైనర్ నాగబాబును అభినందించారు.



ప్రశాంత్‌రాజ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తూగోలో నరసరావుపేట వాసి మృతి



నరసరావుపేటటౌన్: తూర్పు గోదావరి జిల్లా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసరావుపేట వాసి దుగ్గెంపూడి వేమారెడ్డి (40) సోమవారం దుర్మరణం చెందాడు. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందిన వేమారెడ్డి వ్యాపార రీత్యా కొన్నేళ్లుగా నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో స్థిరపడ్డాడు. రెడీమేడ్ గోడలు, సిమెంట్ బల్లలు తయారు చేసే వ్యాపారం చేస్తూంటాడు. వేమారెడ్డి అతని స్నేహితులు వై.సాయిరెడ్డి, మాధవరెడ్డిలు కలిసి కారులో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వెళ్లారు. అక్కడ ఫార్మాసుటికల్ కంపెనీలో మాధవరెడ్డిని విడిచిపెట్టి వేమారెడ్డి, సాయిరెడ్డి నరసరావుపేటకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో నల్లజర్ల మండలం దూబచర్ల జాతీయ రహదారి వద్దకు రాగానే ముందు వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని ఢీకొన్నారు. సంఘటనలో కారు నడుపుతున్న వేమారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, సాయిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వేమారెడ్డి నరసరావుపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా ఉండేవాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు మృతదేహం భద్రపరిచిన ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు.

విద్యా, వసతి దీవెన బకాయిలు చెల్లించండి

కలెక్టర్‌ను కోరిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

నరసరావుపేట: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ, బీటెక్, వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రావాల్సిన విద్యాదీవెన, వసతి దీవెన నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని చెల్లించకపోవటంతో విద్యార్థులను ఆయా యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా పరీక్షలు రాయనీయట్లేదన్నారు. దీని వలన హాస్టళ్లలో ఉన్న పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీచేయాలని కోరారు. నాయకులు ఎం.మధు, హేమంత్, యాసిన్, సాయి శ్రీనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మెడికల్ కాలేజ్ బృందం పర్యటన

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల డాక్టర్ల బృందం సభ్యులు సోమవారం పర్యటించారు. కాలనీలో పర్యటించి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిని ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వాంతులు, విరేచనాలకు వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. బాధితుల వైద్య సేవల రిపోర్టులను కూడా పరిశీలించారు. కలుషితమైన నీరు తాగకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని కాలనీవాసులకు సూచించారు. వాంతులు, విరేచనాలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయని డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య తెలిపారు.



బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

పెనమలూరు: తాడిగడపలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. తాడిగడప రైస్ మిల్లు సమీపంలో 15 ఏళ్ల బాలిక తల్లిదండ్రులతో నివసిస్తోంది. ఆ బాలికకు ఇన్‌స్టాగామ్‌లో పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కన్నెగంటి సంపత్‌కుమార్‌తో పరిచయమైంది. సంపత్‌కుమార్ తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని, వివాహం చేసుకుంటానని బాలికను నమ్మించాడు. ఈనెల 25న బాలిక సోదరుడితో కలిసి బయటకు రాగా సంపత్‌కుమార్ కారులో వచ్చి ఆమెను కారులో ఎక్కించుకొని తీసుకు వెళ్లిపోయాడు. ఈ విషయం బాలిక సోదరుడు తల్లిదండ్రులకు తెలిపాడు. తల్లిదండ్రులు బాలికకు, సంపత్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్చాఫ్ వచ్చాయి. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి

మాచర్ల: పట్టణంలోని 15వ వార్డులో నివాసం ఉంటున్న యామని (35) పది రోజులుగా జ్వరంతో బాధపడుతూ పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. డెంగీ లక్షణాలు కనిపించడంతో ఆసుపత్రి వైద్యులు వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. యామనిని బంధువులు హైదరాబాద్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.